## చలాన్లు చెల్లించాలి

నిజాంపేట, జనవరి 11 : వాహనదారులు పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు చెల్లించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.గురువారం నిజాంపేట మండల కేంద్రం శివారులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈనెల 31 వరకు వాహనాల ట్రాఫిక్ చలాన్లను రాయితీపై చెల్లించడానికి ప్రభుత్వం అవకాశాన్ని కల్పించిందన్నారు. మీ సేవ, ఇంటర్నెట్, ఫోన్ పే ద్వారా చలాన్లు చెల్లించవచ్చని ఎస్సై వివరించారు.

## అక్షింతల పంపిణీ

రామాయంపేట, జనవరి 11 : మండలంలోని దామరచెర్వు గ్రామంలో సర్పంచ్ పడాల శివప్రసాదరావు అయోధ్య రాముడి అక్షింతలను గురువారం ఇంటింటికీ వెళ్లి అందజేశారు. సర్పంచ్ వెంట ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ఉన్నారు.

### అంబేద్కర్ విద్యాలయంలో
## ప్రవేశాలకు అవకాశం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 11: అంబేద్కర్ సార్వత్రిక విద్యాలయం డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు మరోసారి అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని కళాశాలలోని అంబేద్కర్ అధ్యాయన కేంద్రంలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డిని (7382 929698) సంప్రదించాలని కోరారు.

### యువజనోత్సవాల్లో
## సత్తా చాటిన స్ఫూర్తి


స్ఫూర్తి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 11 : రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల్లో భాగంగా ఉపన్యాస పోటీల్లో మెదక్ జిల్లాకు చెందిన స్ఫూర్తి ద్వితీయ బహుమతి గెలుచుకున్నట్లు యువజన క్రీడాశాఖ అధికారి నాగరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర యువజన సర్వీసుల ఆధ్వర్యంలో ఈ నెల 5, 6వ తేదీల్లో హైదరాబాద్‌లో యువజన ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలకు మెదక్ జిల్లా నుంచి వివిధ అంశాల్లో 34 మంది కళాకారులు పాల్గొన్నారు. ద్వితీయ బహుమతి సాధించిన స్ఫూర్తిని ఆయన అభినందించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

వెల్దుర్తి, జనవరి 11 : మండలంలోని నెల్లూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మాసాయిపేట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీపీ స్వరూప చేసిన తనిఖీల్లో పప్పు, కోడిగుడ్లు తక్కువగా ఉన్నట్లు తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం ఉండాల్సిన పప్పు, కోడిగుడ్లు లేవని అంగన్‌వాడీ టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సూపర్‌వైజర్ మాట్లాడుతూ తాము తనిఖీ చేసే సమయానికి తక్కువగా ఉన్న 8 కిలోల కందిపప్పు, 40 కోడిగుడ్లు కేంద్రంలో ఉన్నాయని, అవి స్థానికంగా కొనుగోలు చేసినట్లు గుర్తించామన్నారు. స్టాక్ సమానంగా ఉండడంతో తక్కువగా ఉన్న సరుకులు రికవరీ అయినట్లు సూపర్‌వైజర్ తెలిపారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 11: టీఆర్టీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు గురువారం క్యాంపు కార్యాలయంలో టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రణీద్ కుమార్, ఐలయ్య, నాయకులు రవీందర్‌గౌడ్, వెంకటేశం, ప్రభాకర్, సిద్ధిరాములు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.


మెదక్ మున్సిపాలిటీ : సిద్ధార్థ్ పాఠశాలలో ముగ్గుల పోటీలు



మెదక్ మున్సిపాలిటీ : ముగ్గుల పోటీల్లో అవంతికి ప్రథమ బహుమతిగా నగదు అందజేస్తున్న శివాని


చేగుంట : మక్కరాజిపేటలో పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

# సంక్రాంతి ముగ్గులు

- మెదక్ పట్టణంలో అబ్బురపరిచిన చిన్నారుల సంక్రాంతి ప్రదర్శనలు
- విద్యాసంస్థల్లో ముందస్తు సంబురాలు

మెదక్ మున్సిపాలిటీ/ చిలిపిచెడ్/ రామాయంపేట/ నిజాంపేట/ వెల్దుర్తి/ నర్సాపూర్, జనవరి 11 : అతివల చేతుల నుంచి జాలువారిన ముత్యాల ముగ్గులతో ఆవనిపై రంగుల హరివిల్లు విరిసింది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గుల్లో రంగులు అద్దారు. సంక్రాంతి పండుగ ముందే వచ్చిందా.. అనేలా ఆడపడుచులప రంగవల్లులు అలంకరించారు. మెదక్‌లోని సిద్దార్ధ్ పాఠశాలలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్ సతీమణి శివాని ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ప్రారంభించారు. పోటీల్లో రామాయంపేటకు చెందిన అవంతికి ప్రథమ, మెదక్‌కు చెందిన మాలతికి ద్వితీయ, మెదక్‌కు చెందిన సౌమ్య తృతీయ బహుమతి గెలుచుకున్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాపన్నపేట ఎంపీపీ చందన, మున్సిపల్ కౌన్సిలర్లు దొంతి లక్ష్మి, ఆవారి శేకర్, లింగం, మాజీ కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, గోదల జ్యోతి, బట్టి సులోచన, ముత్యం గౌడ్, సిద్ధార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

చిలిపిచెడ్ మండలం సోమక్కపేట పాఠశాలలో విద్యార్థులు సంక్రాంతి కార్యక్రమాలు నిర్వహించారు. రామాయంపేట, నిజాంపేట, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో గెలిచిన బాలికలకు బహుమతులు ఉపాధ్యాయులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు ఎల్లయ్య, సాగరిక, విఠల్, ఉపాధ్యాయులు మన్మథ, బాలకిషన్, రాజయ్య, రజిని, సంధ్యతోపాటు విద్యార్థులు ఉన్నారు.

### విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జూనియర్ సివిల్ జడ్జి అనిత అన్నారు. నర్సాపూర్‌లోని పీఎన్ రెడ్డి హైస్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు పల్లె నర్సింహరెడ్డి, ఆర్.లక్ష్మీరెడ్డి, అధ్యాపకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో న్యాయవాదులు స్వరూపరాణి, కోర్టు పీసీ అభిషేకం పాల్గొన్నారు.


రామాయంపేట : సంక్రాంతి పండుగ వేషధారణలో విద్యార్థులు


చిలిపిచెడ్ : సోమక్కపేట పాఠశాలలో..


వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..


నిజాంపేట : నస్కల్ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


నర్సాపూర్‌లోని పీఎన్‌రెడ్డి హైస్కూల్‌లో జూనియర్ సివిల్ జడ్జి అనిత

# క్రీడారంగంలో రాణించాలి

- క్రీడలతో దేహదారుఢ్యం
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- రంగంపేటలో ప్రీమియర్ లీగ్-3 క్రికెట్ పోటీలు ప్రారంభం

కొల్చారం, జనవరి 11 : క్రీడలతో సోదరభావం, శారీరక ధారుఢ్యం పెంపొందుతుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని రంగంపేటలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రీమియర్ లీగ్-3 పోటీలను ఎమ్మెల్యే, జడ్పీటీసీ మేఘమాల, ఎంపీపీ మంజుల, సర్పంచ్ బండి సుజాతతో కలిసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మచ్చ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు రవితేజరెడ్డి, రంగంపేట సొసైటీ వైస్‌చైర్మన్ మోత్కు మల్లేశం, బీఆర్‌ఎస్ నాయకులు సాయాగౌడ్, సత్యాగౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతత లభిస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. కొల్చారం మండలంలోని రంగంపేట మధనానంద ఆశ్రమంలో జరుగుతున్న శ్రీ కృష్ణానంద సరస్వతీ స్వామి ఆరాధన ఉత్సవాల్లో గురువారం హోమం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ మధవానంద ఆశ్రమం నర్సాపూర్ నియోజకవర్గంలో ఉండడం అదృష్టమన్నారు. ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆమెతో ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ మేఘమాల, సీడీసీ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, సర్పంచ్‌లు బండి సుజాత, మాధవి, సంతోష, నాయకులు రవితేజరెడ్డి, ఆంజనేయులు, సోమ నర్సింహులు, మచ్చ శ్రీనివాస్, సాయాగౌడ్, ఉప్పరి సంగమేశ్వర్, సత్యాగౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.


కొల్చారం : రంగంపేటలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ -3 పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


కొల్చారం : రంగంపేట ఆశ్రమంలో తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

## ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

- జిల్లా వ్యవసాయాధికారి గోవిందు

కొల్చారం, జనవరి 11 : రైతులు పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాధికారి గోవిందు తెలిపారు. కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో గురువారం వరినాట్లను పరిశీలించి, వరిలో వచ్చే చీడపీడలు, తెగుళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకంతో ఎక్కువగా చీడపీడలు వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడకంతో ఖర్చు తక్కువ అవుతుందని, పంట ఉత్పత్తుల్లో నాణ్యత ఉంటుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వెంట ఏఈవో రోజా, రైతులు గోవర్ధన్, శేఖర్ తదితరులు ఉన్నారు.

## 'కల్యాణలక్ష్మి' అందజేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

పెద్దశంకరంపేట, జనవరి 11 : లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేయాలని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి తహసీల్దార్ గ్రేసీబాయికి వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయని, కాల పరిమితి తీరకముందే ఇవ్వాలని కోరారు. తిర్మలాపురంలోని 1, 237, 238, 254 సర్వేనంబర్లలోని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఎంపీటీసీలు వీణాగౌడ్, దత్తు, సర్పంచ్ రాములు, నేతలు నరేశ్, రవీందర్, అంజయ్య ఉన్నారు.

# కస్టమర్ కేర్ నకిలీ నంబర్లతో జాగ్రత్త

- సైబర్ క్రైమ్ ఏడీజీ షిఖా గోయల్

మెదక్ అర్బన్, జనవరి 11: ఇంటర్‌నెట్ మాధ్యమంతో ప్రైవసీ భగ్నం, బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏడీజీ షిఖాగోయల్ అన్నారు. గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, సీపీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజీ మాట్లాడుతూ.. సాంకేతిక ప్రపంచంలో కంప్యూటర్ పరికరాలు, స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో అరచేతిలోనే ప్రపంచం అన్న చందంగా కొనసాగుతున్నదన్నారు. కస్టమర్ కేర్ పేరు మీద సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు, ప్రైవేసీని భగ్నం చేయడానికి ప్రయత్నిస్తారని, ఎవరికీ ఎలాంటి ఓటీపీలు చేపొద్దన్నారు. ఫేక్ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించి సైబర్ నేరగాళ్లు వసూళ్లకు పాల్పడ్డారని, రోజుకో తరహా కొత్త రకం సైబర్ నేరంతో మోసాలు చేస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ ఫోన్ నంబర్లతో ఉపయోగించి గిఫ్ట్స్, ఆఫర్ల పేర్లతో పాత పద్ధతులను ఉపయోగిస్తున్నారని, ఇలాంటి నేరాలను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ డాక్టర్ బాలస్వామి, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.


ఎస్పీ బాలస్వామి, అదనపు ఎస్పీ మహేందర్


రామాయంపేటలో రంగుల విక్రయాలు


రామాయంపేటలో పతంగుల విక్రయాలు

# బీజేపీ విధానాలతో దేశానికి నష్టం

- కొత్త క్రిమినల్ చట్టాలు వెనక్కి తీసుకోవాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 11 : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా మతోన్మాదం, కార్పొరేట్ విధానాలతో దేశానికి నష్టం జరుగుతున్నదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీఐటీయూ జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. బీజేపీ ప్ర భుత్వం మతోన్మాదం రెచ్చగొట్టేలా వ్యవహరిస్తూ దేశ శ్రేయస్సుకు భంగం కలిగిస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలు అప్పజెప్పడం సరికాదన్నారు. ఇప్పటికే రైల్వే, బీఎస్ఎన్ఎల్ తదితర ప్రభుత్వ సంస్థలు కార్పొరేట్లకు అప్పగించారన్నారు. దేశంలో నిరుద్యోగం లేకుండా చేస్తానని చెప్పిన బీజేపీ నేడు నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తుందన్నారు. గతంలో రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి రైతులను చంపిన కేంద్రం నేడు కొత్త క్రిమినల్ చట్టాలు తీసుకురావడంతో అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. కేంద్రం వెంటనే క్రిమినల్ చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌రెడ్డి, బస్వరాజు, నాయకులు మల్లేశం, నాగరాజు, నర్సమ్మ, నాగేందర్‌రెడ్డి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులూ.. భద్రం



పెద్దశంకరంపేట, జనవరి 11 : సంక్రాంతి పండుగ వచ్చిందంటే చిన్నారుల నుంచి యువకుల వరకు అందరికీ గుర్తుకు వచ్చేది పతంగులు ఎగురవేయడం. అలాంటి పతంగుల పండుగను ఆనందంగా జరుపుకోవాలంటే జాగ్రత్తలు పాటించాలి. సంక్రాంతి పండుగను మూడు రోజులు నిర్వహించడం ఆనవాయితీ. చిన్నారులు మూడు నుంచి ఐదు రోజుల పాటు పతంగులను ఎగుర వేస్తుంటారు. చిన్నారులు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదం బారిన పడే అవకాశాలు ఉన్నాయి. పతంగులు ఎగురవేసే చిన్నారులు, యువకుల జాగ్రత్తలు పాటించాలి.

- పతంగులను దాబాలపైన ఎగురవేయవద్దు.
- తప్పనిసరైతే పెద్దల సమక్షంలో చుట్టూ గోడలు ఉన్న బంగ్లాలపై ఎగురవేయాలి.
- రద్దీ ప్రాంతాల్లో ఎగురవేస్తే ప్రమాదం
- ట్రాఫిక్ సమస్యలతో చిన్నారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.
- ఎత్తైన్న ప్రదేశాల్లో వెళ్లడం మానుకోవాలి.



- పతంగులు తెగిపోయినప్పుడు వదిలేయాలి.
- చైనా దారంతో చేతులు, మెడ భాగం తెగే అవకాశాలు ఎక్కువ.
- విద్యుత్ తీగలు, చెట్టుకొమ్మలకు పతంగులు చుట్టుకున్నప్పుడు వాటిని తీయవద్దు.
- ఖాళీ ప్రదేశాలు, మైదాన ప్రాంతాల్లో పతంగులను ఎగురవేయాలి
- పతంగులను ఎగుర వేసేటప్పుడు చిన్నారులను తల్లిదండ్రులు గమనించాలి.